సాక్షి
రంగారెడ్డి
గురువారం । 7 । ఆగస్టు । 2025



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

జనగాంలో ఈ నెల 7 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. 8లో ▸



చోరీ కేసులో అరెస్టు

వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాన్ని అపహరించిన ఓ జంటని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. 8లో ▸



చిన్నారుల ఆరోగ్యానికి..

చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి అన్నారు. 8లో ▸

తూకం.. మోసం!

'సొమ్ము' చేసుకుంటున్న వ్యాపారులు



- ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- పట్టించుకోని తూనికలు, కొలతల అధికారులు
- జిల్లాలో గత ఏడాది 275 కేసులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 98 నమోదు

☛ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి 200 గజాల ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. తెల్లవారు జామునే చంపాపేట ఇసుక లారీల అడ్డాకు చేరుకున్నాడు. నచ్చిన ఇసుకను మాట్లాడుకుని ఆ పక్కనే ఉన్న ఓ వే బ్రిడ్జ్‌లో తూకం వేయించాడు. ఇసుక బరువు 32 టన్నులు ఉన్నట్లు బిల్లు జారీ చేశారు. అనుమానం వచ్చి మార్గమధ్యలో ఉన్న మరో వేబ్రిడ్జ్‌లో తూకం వేయించగా 28 టన్నులే వచ్చింది.

☛ ఓ ద్విచక్రవాహనదారుడు జెడ్పీరోడ్డులోని ఓ పెట్రోల్‌బంకులో పెట్రోలు కొట్టించాడు. ట్యాంక్ నిండా పెట్రోలు పోయించినప్పటికీ.. ఎంతకీ ఇంజన్ స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చి చెక్ చేయగా బైక్‌లో పోసింది పెట్రోల్ కాదని, నీళ్లు అని తేలింది.

☛ ఎల్బీనగర్‌కు చెందిన ఓ గృహిణి నిత్యావసరాల కొనుగోలు కోసం సమీపంలోని ఓ మార్ట్‌కు వెళ్లింది. ర్యాక్‌లో ఓ వరుసలో సర్దిపెట్టిన పప్పులు, ఉప్మారవ్వ, చక్కెర, గోధుమపిండి (ప్యాకెట్లు కేజీల్లో) సహా ఇతర వస్తువులు బిల్లింగ్ చేయించింది. ఇంటికి వెళ్లిన తర్వాత అనుమానం వచ్చి తూకం వేయగా ఒక్కో ప్యాకెట్‌లో 100 గ్రాములు తక్కువ ఉండటాన్ని చూసి విస్తుపోయింది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వినియోగదారులు అవసరాన్ని, అమాయకత్వాన్ని కొంత మంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో 349 పెట్రోల్ బంకులు ఉండగా, వందకుపైగా వేబ్రిడ్జ్‌లు ఉన్నాయి. నిత్యావసరాలు విక్రయించే కిరాణాలు, సూపర్ మార్కెట్లు మొదలు.. చికెన్, మటన్ దుకాణాలు, రైతుబజార్లు, ప్రధాన రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లపై విక్రయించే కూరగాయలు, పండ్ల తూకాల్లోనూ భారీ మోసాలకు పాల్పడుతున్నారు. కొనుగోలుదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా షాపుల్లో తనిఖీలు నిర్వహించి తక్కెడ, బాట్ల తూకాలను పరిశీలించాల్సిన తూనికలు కొలతలశాఖ పరోక్షంగా వారికి సహకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. 2024లో జిల్లా వ్యాప్తంగా 275 కేసులు నమోదు చేయగా, 2025లో ఇప్పటి వరకు 98 కేసులను మాత్రమే నమోదు చేయడం ఈ శాఖ అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. తూకాల్లో మోసాలపై ఎవరైనా వినియోగదారులు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించడం లేదు. 27 మండలాలు, 526 రెవెన్యూ గ్రామాలు, 15 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్న జిల్లాకు కేవలం ముగ్గురే అధికారులు ఉండటం కూడా తక్కువ కేసులు నమోదు కావడానికి మరో కారణమనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ప్రశ్నిస్తే వాగ్వాదం

ఇంటి నిర్మాణం కోసం రెండు రోజుల క్రితం బాలాపూర్‌లోని ఓ ప్రైవేటు డంప్ నుంచి ఇసుక కొనుగోలు చేశాను. వాహనం ట్రక్కు నిండా ఇసుక నింపి స్థానికంగా ఉన్న ఓ వేబ్రిడ్జిలో తూకం వేయగా 12 టన్నులు ఉన్నట్లు చూపించింది. అనుమానం వచ్చి మరోచోట తూకం వేయగా రెండు టన్నుల వ్యత్యాసం చూపించింది. అదేమని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు.

– రవీంద్రాచారి, రియల్టర్

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

మార్గమధ్యలో పెట్రోల్ ఖాళీ కావడంతో పక్కనే ఉన్న ఓ బంక్‌కు వెళ్లి కొట్టించాను. బైక్ స్టార్ట్ చేసి తీరా అర కిలోమీటర్‌కు వెళ్లిన తర్వాత ఆగిపోయింది. అనుమానం వచ్చి చూడగా పెట్రోల్ నీళ్లలా ఉంది. బంక్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే తమ తప్పేమీ లేదని, కంపెనీ నుంచే ఇలా వచ్చిందని బుకాయించారు. విజిలెన్స్, తూనికలు కొలతలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

– తిరుమలేష్, ద్విచక్రవాహనదారుడు

వక్ఫ్ భూములు పరాధీనం

- వికారాబాద్ జిల్లాలో 2,170 ఎకరాలు
- ఆక్రమణలపై తరచూ కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, వక్ఫ్ బోర్డ్ అధికారులు
- 2006 సంవత్సరంలో సర్వే.. నేటికీ వెల్లడి కాని భూముల వివరాలు



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వికారాబాద్: వక్ఫ్ బోర్డు భూములు రోజురోజుకూ అన్యాక్రాంతం అవుతూనే ఉన్నాయి. మెజార్టీ భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పరిగి మండలం సుల్తాన్‌పూర్ రెవెన్యూ పరిధిలో వక్ఫ్ భూములను పక్క పొలం రైతులు ఆక్రమించారని ఎర్రగడ్డపల్లికి చెందిన కొందరు కలెక్టర్, ఎస్పీ, డీఆర్ఓ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. సమాధులను సైతం కూల్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆ భూములను గతంలో వక్ఫ్ బోర్డు అధికారులు పలుమార్లు సందర్శించారు. కబ్జాకు గురయ్యాయని తేల్చారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు వచ్చిన ప్రతి సారీ వక్ఫ్ బోర్డు అధికారులు, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెపం మోపి కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలో 2,170 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయని ఆ శాఖ అధికారులు చెబుతుండగా అవి చాలా వరకు కాగితాలకే పరిమితమయ్యాయి. పొజిషన్‌లో మాత్రం వేరేవారు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో పలుకుబడి ఉన్న వ్యక్తుల చేతుల్లోకి ఎప్పుడో వెళ్లి పోయాయి. కొన్ని చోట్ల సంరక్షకులుగా ఉన్న వారే యజమానులుగా మారిపోయారు. మరి కొన్ని చోట్ల కాగితాల్లో భూములు కనిపిస్తున్నాయి. పరాధీనం అయిన భూములపై ఫిర్యాదులు వచ్చినా విచారణ జరిపిన దాఖలాలు కనిపించడం లేదు. ఒక వేళ విచారణ జరిపినా నేతల ఒత్తిడి.. కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు కారణంగా నివేదికలు బుట్టదాఖలు అవుతున్నాయి.

సర్వే చేయడంలో విఫలం

వక్ఫ్ భూములు ఉన్నదెంత.. ? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి..? ఎవరి ఆధీనంలో ఉన్నాయి..? అనే దానిపై ఆ శాఖ అధికారులకే స్పష్టత లేదు. రెవెన్యూ అధికారులకు అవగాహన ఉన్నా వారు పట్టించుకోవడం లేదు. ఇటు రెవెన్యూ.. అటూ వక్ఫ్ బోర్డు అధికారుల కనుసన్నల్లోనే భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో వక్ఫ్ భూములపై 1958 – 64 ప్రాంతంలో సర్వే నిర్వహించారు. 2006లో మరోసారి సర్వే చేసినా ఆ వివరాలను ప్రభుత్వం ప్రకటించలేదు. ఈ సర్వే ప్రకారం వక్ఫ్ భూముల విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రెండో విడత సర్వే చేసి ఉంటే..

రాష్ట్ర ప్రభుత్వం 2017 ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భూ ప్రక్షాళన సర్వేలో అన్యాక్రాంతమైన భూముల వివరాలు వెల్లడవుతాయని అందరూ భావించారు. కానీ మొదటి విడతలో కేవలం లిటిగేషన్ లేని భూములను మాత్రమే సర్వే చేశారు. రెండో విడత సర్వే చేసి ఉంటే వక్ఫ్ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో తెలిసేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

అనేక చోట్ల కబ్జా

☛ పరిగి మండలం సుల్తాన్‌పూర్ శివారులో ఓ దర్గా సమీపంలో ఉన్న వక్ఫ్ బోర్డులు ఉన్నాయి. ఇందులో సుమారు ఐదెకరాల భూమి పరాధీనం అయ్యింది. గార్డియన్‌గా ఉన్న ఓ వ్యక్తి ఏకంగా వాటిని తన పేరున రాయించుకున్నాడు. ఈ విషయంలో స్థానికంగా నివాసముండే ఓ వ్యక్తి రెవెన్యూతో పాటు వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ జరిపి నివేదిక కూడా ఉన్నతాధికారులకు అందజేశారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. తాజాగా రెండు రోజుల క్రితం కూడా అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతేడాది అధికారులు ఆ భూములను పరిశీలించి కబ్జాకు గురైనట్టు తేల్చారు, కాని ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదు. వీటితో పాటు పరిగి మున్సిపల్ పరిధిలోని 568 సర్వే నెంబర్‌లో సుమారు 205 ఎకరాల భూమి ఉండగా అందులో చాలా వరకు అన్యాక్రాంతం అయ్యింది. పరిగి మండలం రాపోల్ గ్రామంలో వక్ఫ్ భూములు పరాధీనమయ్యాయి. ఇదే మండలం నారాయణ్‌పూర్‌లో 24 ఎకరాలు ఉండగా 22 ఎకరాలు కబ్జాకు గురైనట్లు స్థానికులు తెలిపారు. వికారాబాద్, ధారూరు, తాండూరు మండలాల్లో సైతం అన్యాక్రాంతం అయ్యాయి.

ఓల్డ్‌మలక్‌పేటలో కుంగిన రోడ్డు



చాదర్‌ఘాట్: నగరంలో రహదారులు, నాలాలు కుంగిపోవడం పరిపాటిగా మారింది. మంగళవారం బంజారాహిల్స్‌లో నాలా కుంగి లారీ ఇరుక్కున్న సంగతి విదితమే. అలాంటి ఘటనే ఓల్డ్ మలక్‌పేటలో చోటుచేసుకుంది. డివిజన్ పరిధిలోని లాలాజగ్ ఎక్స్ రోడ్ నుంచి హెచ్ఆర్‌సీ వైపు వెళ్లే రహదారిలో పంచశీల లైబ్రరీ వద్ద బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా రహదారి కుంగి పెద్ద గుంత ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

దొరకని ఆచూకీ

- నాగార్జునసాగర్ అందాలు చూడ్డానికి వెళ్లి..
- ప్రమాదవశాత్తు నదిలో పడిపోయిన యువకుడు
- గల్లంతై మూడు రోజులైనా లభించని జాడ



గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

మంచాల: నాగార్జునసాగర్ అందాలు చూడడానికి స్నేహితులతో కలిసి వెళ్లిన యువకుడి ఆచూకీ మూడు రోజులైనా దొరకలేదు. మండలంలోని జాపాల గ్రామానికి చెందిన మంతని శివ (24), సోప్పరి శివ, కాగజ్‌ఘట్ గ్రామానికి చెందిన దూసరి గణేశ్, ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన పండుగ నర్సింహా స్నేహితులు. సోమవారం సాయంత్రం సరదాగా చూసొద్దామని నాగార్జునసాగర్ వెళ్లారు. కొద్ది సేపు బ్రిడ్జిపై కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. అంతలోనే శివ బ్రిడ్జిపై నుంచి నదిలో పడిపోయాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మూడు రోజులైనా జాడ కనిపించలేదు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో తల్లిదండ్రులు గారాబంగా పెంచారు. ఆచూకీ దొరకకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జయశంకర్‌కు ఘన నివాళి



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పోరాడి, ఉద్యమానికి ఊపిరి పోసింది ప్రొఫెసర్ జయశంకర్ అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 91వ జయంతి ఉత్సవాలను బుధవారం కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్‌పాత్ర మరువలేనిదని తెలిపారు. ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారని, స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి కేశురాం, వెనుకబడిన సంఘాల నాయకుడు మల్లేష్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

డబుల్ బెడ్రూం ఇళ్ల పెండింగ్ పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సంబంధిత అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, పెండింగ్ పనులపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేటాయింపు విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా సంపుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి 15 రోజుల్లో లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని, లేని పక్షంలో బాధ్యులైన వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.హన్మంత్‌రావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సంఘం నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్‌కార్డులు వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ అమలుకు ప్రయత్నం చేయాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, నూతన పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకోసం టీపీయూఎస్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్, మండల కోశాధికారి దూత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా గురుకులాలు



ఆన్‌లైన్ తరగతులను పరిశీలిస్తున్న రమణకుమార్

- బోధన, వసతుల కల్పనలో మేటి
- ట్రైస్ సెక్రటరీ రమణకుమార్
- తాండూరులోని గురుకుల బాలికల పాఠశాల సందర్శన

తాండూరు టౌన్: ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ గురుకులాల్లో బోధన సాగుతోందని తెలంగాణ గురుకుల విద్యా సంస్థల (ట్రైస్) కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ అన్నారు. బుధవారం తాండూరులోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, లైబ్రరీ, ల్యాబొరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, ఆన్‌లైన్ బోధనను పరిశీలించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిలబస్‌తో పాటు ఆన్‌లైన్ తరగతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందన్నారు. ప్రతి ఏటా ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. తాండూరు గురుకులంలో బోధన, ఫలితాలు, వసతులు భేషుగ్గా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలాన్ని అడ్డుకున్న రైతులు
- అడిషనల్ కలెక్టర్ హామీతో శాంతించిన వైనం



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తొర్రూర్‌లో హెచ్ఎండీఏ ద్వారా రూపొందించిన లే అవుట్‌లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చేపట్టిన ప్లాట్ల వేలాన్ని భూములు ఇచ్చిన రైతులు అడ్డుకున్నారు. తమకు పరిహారంగా ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకుండా వేలం వేయడంపై అభ్యంతరం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తొర్రూర్‌లోని సర్వే నంబర్ 383/1లో సుమారు 117 ఎకరాల ప్రభుత్వ భూమిని లే అవుట్ చేసి ప్లాట్లుగా విభజించి అమ్మేందుకు గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి హెచ్ఎండీఏ అధికారులు సేకరించారు. పొజిషన్‌లో ఉన్న రైతులకు పరిహారం కింద ఒక్కొక్కరికి 300 గజాల ఇంటి స్థలాన్ని అదే లే అవుట్‌లో ఇచ్చేందుకు ఒప్పించారు. ఈ మేరకు అలాట్‌మెంట్ పత్రాలు జారీ చేశారు. అనంతరం కొన్ని ప్లాట్లను వేలం వేశారు. తమకు ఇచ్చిన పత్రాల ఆధారంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని, ఆ స్థలాలపై పూర్తి హక్కుల కల్పించాలని రైతులు కొంత కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో హెచ్ఎండీఏ నుంచి అధికారం పొందిన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ 510 ప్లాట్లలో 100 ప్లాట్లను వేలం వేసేందుకు సిద్ధమైంది. గ్రామంలోని ఓ కన్వెన్షన్ హాలులో వేలం వేసేందుకు బుధవారం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్ రెడ్డి వచ్చారు. బహిరంగ వేలం మొదలు పెట్టగానే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న రైతులు వేలం పాటకు అడ్డు తగాలారు. పోలీసులు కలుగ జేసుకోవడంతో తోపులాట జరిగింది. అనంతరం వేలం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించి వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డిని అక్కడికి పంపించారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని, 10–15 రోజుల్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగే విధంగా చూస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని తెలిపారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమాచార హక్కుచట్టం సరిగ్గా అమలు చేయాలి



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో బోర్డును పరిశీలిస్తున్న భూపాల్

కొందుర్గు: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం సరిగ్గా అమలు కావడం లేదని రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ అన్నారు. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సమాచార హక్కు చట్టం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో సిటిజన్‌చార్ట్ సరిగ్గా లేదని, 1, 2 రిజిస్టర్లు నిర్వహించడం లేదన్నారు. అప్పిలేట్ అధికారి బదిలీ అయి నెలలు గడుస్తున్నా ఆమె పేరే చార్ట్‌పై ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూడు నెలలుగా రాష్ట్రంలోని మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం తదితర జిల్లాల్లో పర్యటించినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టంపై సరైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆమనగల్లు ఠాణాలో రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

ఆమనగల్లు: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణను పరిశీలించిన అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సీఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్‌తో సమావేశమై పలు సూచనలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఐదు క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు



ఓ క్లినిక్‌కి షోకాజ్ నోటీసు అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు

శంకర్‌పల్లి: ఆర్ఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఆపై ఎలాంటి వైద్య సేవలందించినా కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు హెచ్చరించారు. పట్టణంలోని ఎనిమిది ఆర్ఎంపీ క్లినిక్స్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని ఐదింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు పూర్తి స్థాయి డాక్టర్లు కాదని, దీనిని రోగులు గమనించాలని సూచించారు. ఆస్పత్రికి వెళ్లే ముందు ఆ డాక్టర్‌కి ఉన్న అర్హతలపై ఆరా తీయాలన్నారు. తనిఖీల్లో శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు రేవతి రెడ్డి, సిబ్బంది మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణం నిలుస్తుంది: చిరంజీవి

రాయదుర్గం: రక్తదానంతో ఒక ప్రాణం నిలుస్తుందని, నేటి యువతకు మళ్లీ మళ్లీ చెబుతున్నా.. రక్తదాతలు కావాలని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో నాలెడ్జి సిటీలోని ఫినిక్స్ సంస్థలో మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో చిరంజీవి మాట్లాడుతూ.. ఒక జర్నలిస్ట్ రాసిన కథనం చదివిన తర్వాత బ్లడ్‌బ్యాంక్ పెట్టాలనే ఆలోచన తనకు వచ్చిందని గుర్తు చేశారు. సినీనటులు తేజ సజ్జా, సంయుక్త, ఫినిక్స్ గ్రూప్ చైర్మన్ సురేష్ చుక్కపల్లి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై కత్తితో దాడి

- పశువుల మేత విషయంలో గొడవ
- పోలీసుల అదుపులో తండ్రీకొడుకులు
- ఇద్దరిపైనా హత్యాయత్నం కేసు నమోదు


దాడిలో గాయపడిన రఫియా


కత్తితో దాడి చేస్తున్న హఫీజ్

మొయినాబాద్: పశువుల మేత విషయంలో చోటుచేసుకున్న దాడిలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ హఫీజ్, మహ్మద్ వాజిద్ ఖురేషీ ముర్తూజగూడ రెవెన్యూలోని షమ్స్ కాలనీలో ఇళ్లు కట్టుకుని, కుటుంబాలతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇరువురి వద్దా మేకలు, గేదెలు, ఆవులు ఉన్నాయి. కాలనీలోని ఖాళీ ప్లాట్లలో వీటిని మేపుతుంటారు. బుధవారం ఉదయం వాజిద్ తన మేకలు, గేదెలను ఓ ప్రాంతంలోని ఖాళీ ప్లాట్లలో కట్టేశాడు. ఇది గమనించిన హఫీజ్, అతని కొడుకు అఫ్రోజ్ ముందు నుంచీ తమ పశువులను ఇక్కడే మేపుతున్నామని, నీవెందుకు కట్టేశావని వాజిద్‌తో గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో అఫ్రోజ్ తమ ఇంట్లో నుంచి కొమ్మలు కొట్టే కత్తి తీసుకొచ్చి తండ్రికి ఇచ్చాడు. ఇద్దరూ కలిసి పక్కింట్లో ఉండే వాజిద్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన అతని భార్య రఫియాను సైతం కత్తితో గాయపర్చారు. దీంతో వాజిద్ తల, మెడ, ఛాతితో పాటు శరీరంపై గాట్లు పడ్డాయి. రఫియా తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపైనా హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్: మద్యం కొనుగోలు కోసం వెళ్లిన ఓ కానిస్టేబుల్‌ను పార్కింగ్ స్థలంలో ఓ యువకుడు అడ్డుకుని తీవ్రంగా కొట్టాడు. వివరాల్లోకి వెళితే..వెంకటగిరిలో నివసించే ఎస్.ప్రసాద్ అనే ఏఆర్ కానిస్టేబుల్ మంగళవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో ఉన్న ప్రియాంకా వైన్స్‌కు బైక్‌పై మద్యం కొనుగోలు కోసం వెళ్లాడు. పార్కింగ్ స్థలంలో అడ్డుగా ఉన్న యువకుడిని పక్కకు జరగాలంటూ చెప్పగా అప్పటికే మద్యం మత్తులో ఊగిపోతున్న సదరు యువకుడు నన్నే జరగమంటావా..? అంటూ ఆగ్రహంతో ఊగిపోతూ పిడిగుద్దులతో చితకబాదాడు. తాను పోలీసునని చెబుతున్నా వినకుండా మళ్లీ కొట్టాడంటూ బాధిత కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడి చేసిన యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారించగా వెంకటగిరికి చెందిన డెలివరీ బాయ్ పల్లె భార్గవ్‌గా గుర్తించారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

పూడూరు: చికిత్స పొందుతూ ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ ఆలంపల్లికి చెందిన హాజీపాషా(24) డీసీఎం వాహనంతో నగరంలోని మార్కెట్‌కు మంగళవారం రాత్రి బయలుదేరాడు. మార్గమధ్యలో ఎన్కేపల్లి గేటు సమీపంలో డీసీఎం అదుపుతప్పి మర్రి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హాజీపాషాకు గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అటునుంచి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విధుల్లో ఉన్న కండక్టర్ గుండెపోటుతో మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌కు గుండెపోటు రావడంతో మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన నిమ్మల బాలరాజ్‌గౌడ్ (54) హయత్‌నగర్- 2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం విధుల్లో చేరిన బాల్‌రాజ్ రాత్రి 8.45గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి బస్‌లో వచ్చాడు. రాత్రి బస్సును కాలనీలో పార్క్ చేసి(నైట్ హాల్ట్), బ్లాక్ నం .62/1లో విశ్రాంతి తీసుకుంటుండగా రాత్రి 11.20 గంటలకు ఛాతిలో నొప్పి వస్తోందని డ్రైవర్ ఉపేందర్‌కు చెప్పాడు. దీంతో ఆయన 108కు సమాచారం ఇవ్వగా అతన్ని పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతి మాట్లాడటం లేదని..


సందీప్ (ఫైల్)

సుభాష్‌నగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతి గత కొన్ని రోజులుగా మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని చనిపోయిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన సందీప్ (20) రాజీవ్ గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సందీప్‌కు విజయవాడకు చెందిన ఓ యువతి ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయమైంది. తరచూ చాటింగ్ చేసుకుంటున్నారు. గత కొన్ని రోజుల నుండి సదరు యువతి నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో మనస్తాపానికి గురైన సందీప్ మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

డాక్టర్ నమ్రతపై మరో కేసు

- ఫిర్యాదు చేసిన నగరానికి చెందిన గైనకాలజిస్ట్
- తాజాగా మరో ఎనిమిది మంది నిందితుల అరెస్టు
- లోతుగా దర్యాప్తు చేస్తున్న గోపాలపురం పోలీసులు



సాక్షి,సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సరోగసి పేరు తో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతపై బుధవారం మరో కేసు నమోదైంది. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీన్ని రిజిస్టర్ చేసిన గోపాలపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో కలిపి ఇప్పటి వరకు నమ్రత, ఆమె ముఠాపై నమోదైన కేసుల సంఖ్య ఆరుకు చేరింది. తాజాగా ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరితో కలిపి ఇప్పటి వరకు అరెస్టు అయిన వారి సంఖ్య 22కు చేరింది. నమ్రతపై 2020లో విశాఖపట్నంలో కేసులు నమోదయ్యాయి. వీటి ప్రభావంతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లైసెన్సులు అధికారులు పొడిగించలేదు. ఆ సమయంలో తాను ఆస్పత్రి మూసేస్తున్నట్లు సమాచారం ఇచ్చిన నమ్రత అక్రమంగా కొనసాగించారు. తన పేరు బయటకు రాకుండా ఉండటానికి చికిత్స కోసం సంప్రదించిన వారికి మరో డాక్టర్ పేరుతో ఉన్న లెటర్ హెడ్‌పై మందులు, పరీక్షల వివరాలు రాసి ఇచ్చారు. రాజస్థాన్ దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గోపాలపురం పోలీసులు సృష్టి సెంటర్‌పై దాడి చేసినప్పుడు ఈ లెటర్‌హెడ్స్ పోలీసులకు లభించలేదు. అయితే వరుసగా తాజా మెట్లు ఎక్కుతున్న బాధితుల్లో కొందరు తమ ఫిర్యాదులతో పాటు నమ్రత రాసి ఇచ్చిన మందుల చీటీలు తదితరాలను జత చేశారు. వీటిలో కొన్ని సదరు డాక్టర్ పేరుతో ఉండటాన్ని గమనించిన పోలీసులు దీనిపై ఆరా తీశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ అయిన ఆమె ఓ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు ఆమెను సంప్రదించినప్పుడే తన పేరుతో ఉన్న లెటర్ హెడ్స్ దుర్వినియోగం అవుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆమె స్వయంగా గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నమ్రతపై బుధవారం మరో కేసు నమోదైంది. రాజస్థాన్ దంపతుల ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో పోలీసులు నమ్రత ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఇది మంగళవారంతో పూర్తి అయింది. తాజాగా మరో కేసులో కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతూ బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోపక్క సహ నిందితులుగా ఉన్న సంతోషి, కళ్యాణిల పోలీసు కస్టడీ పూర్తి కావడంతో కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

86 మందికి సరోగసి

ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన వివరాలు, దర్యాప్తు, ఫిర్యాదుల ఆధారంగా నమ్రత తనకు ఉన్న వివిధ సెంటర్ల ద్వారా 86 మంది దంపతులకు సరోగసి చేసినట్లు గుర్తించారు. వీటిలో సక్రమం ఎన్ని? అక్రమం ఎన్ని? చైల్డ్ ట్రాఫికింగ్ ఎన్ని? అనే అంశాలు ఆరా తీస్తున్నారు. దీనికోసం ఆ ప్రక్రియలు చేయించుకున్న దంపతుల కోసం గాలిస్తున్నారు. రాజస్థాన్ దంపతులతో పాటు మరో మూడు జంటలకు శిశువుల్ని విక్రయించినట్లు బయటపడింది. దీంతో ఈ శిశువులను రెస్క్యూ చేసిన పోలీసులు శిశువిహార్‌కు తరలించారు. ఈ వ్యవహారాల్లో దళారులుగా వ్యవహరించిన వారితో పాటు శిశువుల్ని ఉద్దేశపూర్వకంగా విక్రయించిన ముగ్గురు తల్లుల్ని కటకటాల్లోకి పంపారు. బుధవారం గోపాలపురం పోలీసులు నమ్రతతో సంబంధాలు కలిగి ఉండి, శిశు విక్రయాల దందా నడిపిన విశాఖపట్నం వైద్యులు రవి, రమ్యలతో పాటు ఏజెంట్లు విజయ్, సరోజ, రత్న, శిశువుల్ని విక్రయించిన ముగ్గురు తల్లుల్ని అరెస్టు చేశారు. ఈ ఎనిమిది మంది అరెస్టులతో కలిపి ఇప్పటి వరకు 'సృష్టి' సంబంధిత కేసుల్లో కటకటాల్లోకి చేరిన వారి సంఖ్య 22కు పెరిగింది.

చిన్నారుల ఆరోగ్యానికి చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను సరఫరా చేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలను పంపిణీ చేసి చిన్నారులతో మింగించాలని సూచించారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసుఉన్న పిల్లలకు సగం మాత్రను నీటిలో కలిపి వేయాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాల్లో నివసించడం, చేతులు సరిగా కడుక్కోకపోవడం ద్వారా నులి పురుగులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు స్రవంతి, రాఘవేందర్, ఎంపీహెచ్ఈఓ శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీరామ, అమృత, హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్, లింగం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

అబ్దుల్లాపూర్‌మెట్: జనగాంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి 4వ జాతీయ జావెలిన్ డే వేడుకలు, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌నకు మండల విద్యార్థులు ఎంపికయ్యారు. బాటసింగారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్యాల యాదగిరి తెలిపారు. ఈ నెల 5న సరూర్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల తరఫున పాల్గొన్న కొడిశెల విలాస్, గాండ్ల ఈశ్వరిలు ప్రతిభ చాటారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు వారు ఎంపిక కావడంతో బుధవారం ఇద్దరికి క్రీడా దుస్తులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణిశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చోరీ కేసులో దంపతుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ఆమనగల్లు: వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాన్ని అపహరించిన ఓ జంటని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ సమీపంలో గత నెల 30న సాయిబాబ గుడి దగ్గర బెంచిపై అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు మల్లమ్మ కూర్చుని ఉంది. ఇద్దరు ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపారు. ఈ క్రమంలో మెడలో ఉన్న బంగారు గుండ్ల హారం తీసుకొని నకిలీ ఆభరణం తిరిగి ఇచ్చారు. ఇంటికి వెళ్లిన వృద్ధురాలు అనుమానంతో తన మనవడికి చూపించగా ఆభరణం నకిలీదని గుర్తించి వెంటనే తలకొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి వెల్జాలలో ఆభరణం దొంగిలించి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో బంగారు షాపులో వాటిని విక్రయించినట్లు గుర్తించారు. అనంతరం నిందితులను శంషాబాద్ సీసీఎస్ పోలీసుల సహాయంతో జడ్చర్లలో నవాబ్‌పేట మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలైన ఎరుకలి శ్రీను, అరుణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు. కేసును త్వరితగతిన ఛేదించిన క్రైం కానిస్టేబుల్ జాఘవాను అభినందించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి


ఎద్దు కళేబరం

కేశంపేట: విద్యుదాఘాతంలో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామశివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి ఎదిరె ఆంజనేయులు తన వ్యవసాయ పొలంలోని పశువుల పాకలో రోజు మాదిరిగా తన పశువులను కట్టేశాడు. రాత్రి సమయంలో కాడెద్దు తాడును తెంపుకొని బయటకు వచ్చింది. సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భూమికి తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదవశాత్తు వైర్లు తగిలి విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. కాడెద్దు విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని, తమని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కంటోన్మెంట్: చెట్టుకు ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసే నిఖిల్ తన మిత్రుడు నాగబాబుతో కలిసి మంగళవారం సాయంత్రం సుచిత్ర మార్గంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సుచిత్ర రైల్వే స్టేషన్ సమీపంలో మూత్ర విసర్జన కోసం చెట్లపొదల్లోకి వెళ్లారు. సమీపంలోని చెట్టుకి ఉరేసుకొని వేలాడుతున్న ఓ వ్యక్తి కనిపించాడు. తక్షణమే 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న బోయిన్పల్లి కానిస్టేబుళ్లు దేవేందర్ నాయక్, యాదగిరి గౌడ్ ఘటన స్థలికి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని కిందికి దింపారు. సుమారు 20 ఏళ్ల వయసున్న యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో శవాన్ని స్వాధీనం తీసుకొని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతా డబ్బులు అడిగినందుకు కత్తితో దాడి

కేపీహెచ్‌బీకాలనీ: కిరాణా షాపు ఖాతా డబ్బులు ఇవ్వకపోగా..నిర్వాహకురాలిపై దాడి చేసి కత్తితో దాడి చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని ఎల్ఐజీ 143లో మణిమాల కుటుంబం నివాసం ఉంటుంది. ఈమె స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తుంది. ఇదే కాలనీలోని ఎల్ఐజీ 183లో నివాసం ఉండే రాజేష్‌రెడ్డి కిరాణా షాపులో కిరాణా సామాగ్రి కొనుగోలు చేస్తుంటాడు. దీంతో ఇద్దరి మధ్య పరిచయం పెరగడంతో రాజేష్ రెడ్డి డబ్బులు ఖాతా పెట్టి కిరాణా సామాగ్రి తీసుకునేవాడు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా ఖాతా డబ్బులు ఇవ్వలేదు. దీంతో డబ్బులు ఇవ్వాలని ఆమె ఒత్తిడి చేయగా..బుధవారం మధ్యాహ్నం మణిమాల ఇంటికి వెళ్లిన రాజేష్‌రెడ్డి ఆమెపై అకస్మాత్తుగా దాడి చేశాడు. గొంతు నులిమి పక్కనే ఉన్న కత్తితో గొంతు కోసేందుకు యత్నించాడు. తీవ్రమైన పెనుగులాటలో మణిమాల గొంతుపై కత్తి కోసుకుపోగా, రాజేష్ రెడ్డి చేతికి కూడా గాయాలయ్యాయి. మణిమాల గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి రక్షించి 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. కింద పడిపోయిన రాజేష్‌రెడ్డిని కూడా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాజేష్‌రెడ్డి ప్రవర్తన ఇటీవల కాలంలో విచిత్రంగా ఉందని, ఎక్కడ కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో పాటు మద్యానికి అలవాటు పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

పబ్‌లో యువతితో అసభ్యకర ప్రవర్తన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36 లోని క్రిస్టల్ క్లబ్ పబ్‌లో ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మణికొండలో నివసించే యువతి (29) మంగళవారం రాత్రి తన స్నేహితురాలితో కలిసి క్రిస్టల్ పబ్‌కు వచ్చారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో వీరి వెనుక సీట్లో కూర్చొన్న ఓ యువకుడు వాటర్ బాటిల్‌ను యువతి ఉన్న చోటికి వదిలాడు. తీసుకునే క్రమంలో ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. రాత్రి 12.10 గంటల ప్రాంతంలో సదరు యువతి స్నేహితురాలితో కలిసి బయట నిలబడగా భరత్, మారుతి, డోనాల్డ్ అనే ముగ్గురు యువకులు బయటకు వచ్చి మరోసారి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. అప్పటికే ఆమె సోదరుడు బయటకు రాగా తీవ్రంగా కొట్టారు. ఆపేందుకు వెళ్లిన ఆమెను దూషించారు. విషయం తెలుసుకున్న బౌన్సర్లు బయటకు వచ్చి యువకులను కట్టడి చేసేందుకు యత్నించగా వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో బాధిత యువతితో పాటు ఆమె సోదరుడికి తీవ్ర గాయాలు కాగా, అదే రోజు అర్ధరాత్రి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందారు. జరిగిన ఘటన పట్ల బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు భరత్, మారుతి, డోనాల్డ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని బుధవారం సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో పట్టుకున్నామని ఎక్సైజ్ డీటీఎఫ్ ఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ చదువుతూ ఒక హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న సునీల్ నాయక్ చిత్రపురి నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తీసుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. అందజేయాల్సిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా సికిందద్రాబాద్‌లో డీటీఎఫ్ సీఐ సౌజన్య సిబ్బందితో కలసి తనిఖీలు చేయగా 14 కేజీల గంజాయి లభించిందని తెలిపారు. దీని విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందన్నారు. మరో కేసులో సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద జుర్రు ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయనతో పాటు అనిల్ అనే వ్యక్తిపైనా కేసు నమోదు చేసినట్లు ఈఎస్ శ్రీనివాసరావు వివరించారు.

ప్రాణహాని భయంతోనే రౌడీషీటర్ హత్య

దుండిగల్: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని కోరితే చంపేస్తానని బెదిరించడంతో..ఎప్పటికైనా ప్రాణహాని ఉంటుందని భావించిన సదరు వ్యక్తి మరో ముగ్గురితో కలిసి ఓ రౌడీషీటర్‌ను దారుణంగా హత్య చేశాడు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి తెల్పిన మేరకు..కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఫజల్ (48) స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతనికి ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన స్క్రాప్ వ్యాపారి, రౌడీషీటర్ మహబూబ్‌తో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. ఫజల్, అతని సోదరుడు కలిసి మహబూబ్‌కు ఐదేళ్ల క్రితం రూ.11 లక్షలు అప్పుగా ఇచ్చారు. అప్పటి నుంచి తిరిగి చెల్లించాలని పలుమార్లు కోరగా వాయిదా వేస్తు వస్తున్నాడు. ఈ మధ్య కాలంలో మహబూబ్‌పై ఒత్తిడి తీసుకురాగా తాను తిరిగి డబ్బులు ఇవ్వనని, మరోసారి అడిగితే ఫజల్‌ను చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆందోళన చెందిన ఫజల్..డబ్బులు రాకపోగా మహబూబ్ నుంచి ఎప్పటికైనా అపాయం పొంచిఉందని భావించి అతని హత్యకు ప్లాన్ చేశాడు. ఇందుకు ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన అతని మేనల్లుడు సయ్యద్ జహంగీర్‌ను సహాయం కోరగా, అదే ప్రాంతానికి చెందిన స్నేహితులు షేక్ కరీం, షేక్ అమీర్‌లతో కలిసి పథకం రచించారు. ఫజల్ ఈ నెల 5వ తేదీన మహబూబ్‌కు ఫోన్ చేసి డబ్బుల విషయంపై మాట్లాడేందుకు ఎల్లమ్మబండ ప్రాంతానికి రావాలని కోరాడు. దీంతో మహబూబ్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి వచ్చాడు. అందరు స్థానికంగా ఉన్న గుడ్‌విల్ హోటల్‌లో సమావేశమై మాట్లాడుతుండగా ఒక్కసారిగా వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వెంటనే జహంగీర్ తనతో తెచ్చుకున్న కత్తితో మహబూబ్‌పై విచక్షణారహితంగా దాడి చేయగా కుప్పకూలిపోయాడు. మహబూబ్ వెంట వచ్చిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోగా నలుగురు కలిసి అతన్ని నరికి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించారు. బుధవారం అల్విన్ కాలనీలోని ఓ మద్యం షాపులో మద్యం తాగుతున్న ఫజల్, జహంగీర్, కరీం, అమీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, మూడు కత్తులు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతుడు మహబూబ్‌పై ఓ హత్య కేసు, 13 ఇతర కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

టీసీ ఇచ్చి.. ఇంటికి పంపి!

- విద్యార్థి ప్రవర్తన బాగో లేదంటూ ప్రిన్సిపాల్ నిర్ణయం
- కేశంపేట జ్యోతిబాపూలే గురుకులంలో ఘటన



విద్యార్థికి ఇచ్చిన టీసీ

కేశంపేట: ప్రవర్తన సరిగా లేదనే కారణంతో ఓ పదో తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు. విద్యా సంవత్సరం మధ్యలో హాస్టల్ నుంచి పంపిస్తే తన కొడుకు చదువు పాడవుతుందని తండ్రి ఎంత వేడుకున్నా ప్రిన్సిపాల్ కనికరించలేదని బాధితుడు వాపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చింతగట్టుతండాకు చెందిన పదో తరగతి విద్యార్థి సబావట్ రాహుల్ ఐదో తరగతి నుంచి కేశంపేట జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఇటీవల అతని ప్రవర్తన బాగోలేదంటూ ప్రిన్సిపాల్ ప్రీతి బుధవారం విద్యార్థి తండ్రి రాజును హాస్టల్‌కు పిలిపించారు. మీ కొడుకు వ్యవహారం రోజురోజుకూ శ్రుతిమించుతోందని, అతన్ని భరించలేమని చెప్పారు. విద్యార్థి తండ్రి ఎంతగా వేడుకున్నా ప్రిన్సిపాల్ ససేమిరా అన్నారు. టీసీ తీసుకోకుండా వెళ్లేది లేదంటూ తలుపులు మూసి, తాళం వేశారు. దీంతో రాజు 100కు డయల్ చేసి తనను హాస్టల్‌లో బంధించారని ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ విద్యార్థితో పాటు అతని తండ్రితో సంతకాలు చేయించుకుని టీసీ చేతిలో పెట్టారు. ఇదిలా ఉండగా టీసీలో రాహుల్ ప్రవర్తన బాగుందని రాయడం గమనార్హం

పోలీసులు స్పందించలేదు



నా కొడుకును ఇంటికి తీసుకెళ్లాలని ఒత్తిడి చేశారు. టీసీ తీసుకునే వరకు బయటకు పంపించేది లేదని తలుపులు మూసేశారు. దీంతో నేను 100 నంబర్‌కు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదు. బలవంతంగా టీసీ ఇచ్చి బయటకు పంపించారు. విద్యా సంవత్సరం మధ్యలోనే టీసీ ఇవ్వడంతో నా కొడుకు చదువు ప్రశ్నార్థకంగా మారింది.

– సబావట్ రాజునాయక్, విద్యార్థి తండ్రి

ఎన్నిసార్లు చెప్పినా..

విద్యార్థి ప్రవర్తన బాగా లేకనే టీసీ ఇచ్చాం. ఎన్నిసార్లు చెప్పినా వినకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నాడు. గతంలో డార్మెటరీ రూంలో నిప్పంటించాడు. ప్రస్తుతం టీవీ పగులగొట్టాడు. అతని కారణంగా మిగిలిన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయమై విద్యార్థి తండ్రిని పిలిపించి టీసీ ఇచ్చి పంపించాం.

– ప్రీతి, మహాత్మాజ్యోతిరావుపూలే పాఠశాల ప్రిన్సిపాల్